క్లుప్తంగా

కిశోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు

నందివాడ: నందివాడ మండలంలోని అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు కిశోర బాలికల వికాసంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ విజయఫ్లోరెన్స్ విచ్చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఒక కమిటీగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు భవానీ, నాగశిరీష తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులకు నీటి మళ్లింపు నిలిపివేత



మండవల్లి: చేపల చెరువులకు నీళ్లు మళ్లించడాన్ని సర్పంచ్ అడ్డుకున్నారు. స్థానిక కొండరాయి చెరువులోనికి మంచినీళ్లు తోడుతుండగా, కాలువ మధ్యలో చేపల చెరువుకు నీళ్లు పెడుతుండడాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు గమనించి మోటార్లను ఆపించివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంచినీటి చెరువులకు నీళ్లు పెడుతున్న సమయంలో గ్రామస్తులు, చేపల చెరువుల యజమానులు సహకరించాలని కోరారు.

వెంకటేశ్వర స్వామికి మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

లోక్ అదాలత్ తేదీ మార్పు


కైకలూరు: జాతీయ లోక్ అదాలత్ తేదీ మార్పు చేసినట్లు కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ.లక్ష్మీ శనివారం తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం జాతీయ లోక్‌అదాలత్ మే 10వ తేదీన జరగాల్సి ఉండగా, ఈ కార్యక్రమాన్ని జూలై 5వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కల్వర్టుకు రంధ్రం.. రాకపోకలకు అవరోధం



తోట్లవల్లూరు: స్థానిక యూకోబ్యాంకు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కల్వర్టు పగిలిపోయి రంధ్రం ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు అవరోధం ఏర్పడుతోంది. కొన్ని నెలలుగా మండల పరిధిలోని నార్తువల్లూరు, రొయ్యూరు క్వారీల నుంచి ఇసుక రవాణ జరుగుతున్న విషయం విదితమే. ఆయా క్వారీల నుంచి భారీ లోడుతో లారీలు ఇసుకను రవాణ చేస్తుండటంతో కల్వర్టు పగిలిపోయి రంధ్రం ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. దెబ్బతిన్న కల్వర్టును ఆర్అండ్‌బీ ఏఈఈ మల్లికార్జున శనివారం పరిశీలించారు. కల్వర్టుకు ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు

సమస్యల పరిష్కారానికి కృషి



నందివాడ: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని జనార్దనపురంలో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి ఎమ్మెల్యే రాముకు మినుము పంటకు మద్దతు ధర ఇప్పించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.7,400 అయితే రూ.7 వేలకు కొంటున్నారన్నారు. గుడివాడ మార్కెట్ యార్డులో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, అంజిరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఈఓపీఆర్డీ బాషా, ఇరిగేషన్ డీఈ, ఏఈ, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రోడ్లపై నరక యాతన

పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన నల్లగుంట వెళ్లే రహదారి



గుంతలమయంగా ఉన్న సత్యనారాయణపురం రోడ్డు

పామర్రు: మండలంలోని పలు రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పామర్రు–చల్లపల్లి జాతీయ రహదారి నుంచి నల్లగుంట, సత్యనారాయణపురం, ఉరుటూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దీంతో రాక పోకలకు ప్రజలు అవస్థలుపడుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లేందుకు నిర్మించిన ప్రధాన రహదారి నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో వేసిన అనతి కాలంలోనే అధ్వానంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు ఉన్న ఈ రహదారి అంతా గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు.

మూడు గ్రామాలకు ఇదే దారి

పామర్రు–చల్లపల్లి జాతీయ రహదారి నుంచి నల్లగుంట, సత్యనారాయణపురం, ఉరుటూరు గ్రామ ప్రజలు ఈ రహదారి గుండా ప్రతి రోజూ ప్రయాణించాల్సి ఉంటుంది. అంతే కాకుండా నల్లగుంట పరిధిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు వెళ్లాలంటే ఈ రహదారి గుండా ప్రయాణించాలి. రోజూ ఈ రహదారి గుండా సుమారు రెండు వేల మంది ప్రయాణిస్తూ ఉంటారు. రహదారి అంతా గుంతలమయంగా మారి, రాళ్లు తేలి ఉండడంతో అవస్థలు పడుతున్నామని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు అయితే ఈ రహదారిపై ప్రయాణం నరకమేనని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేసి, సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్న రైతులు

ఈ రహదారి గుండా వెళ్లే రైతులకు సంబంధించి సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పొలాలన్నీ పామర్రు గ్రామానికి చెందిన వారివే. దీంతో రైతులు రోజూ పొలం వచ్చి పనులను చేసుకుంటూ ఉంటారు. ఎరువులు, పండించిన ధాన్యం సరఫరా చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. పొలంలో ఏ పని చేయాల్సి ఉన్నా ఈ రహదారి గుండానే ప్రయాణం చేసి గమ్య స్థానం చేరుకోవాలి. రహదారి గుంతలమయంగా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

ప్రయాణం నరకంలా ఉంది



గోతులమయంగా మారిన ఈ రహదారుల్లో ప్రయాణిస్తే నరకాన్ని చూస్తున్నాం. ప్రతి రోజూ పొలం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. గోతుల వలన ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.
– బి.కృష్ణారెడ్డి, పామర్రు

చాలా ఇబ్బందులు పడుతున్నాం



నల్లగుంట రహదారి పూర్తిస్థాయిలో పాడైపోవడం కారణంగా ప్రయాణానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణం నరక ప్రాయంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.
– అంబేద్కర్, నల్లగుంట

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తనివ్వకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక పరిషత్ హాల్లో ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కామినేని మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నీటి సంఘాల అధ్యక్షులు కలసి గ్రామ తాగునీటి చెరువులను నింపుకోవాలన్నారు. ప్రతి ఏటా వర్షాల సమయంలో గోపవరం వంతెన నీట మునిగి రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. ఇక్కడ పుల్లవ కాల్వపై 2.50 కోట్లతో నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఎంపీపీ అడవి కృష్ణ మండల ప్రగతి, సమస్యలను వివరించారు. అనంతరం ఇటీవల వైస్ ఎంపీపీగా ఎన్నికైన మంగినేని రామకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా బండి నడిపితే తల్లిదండ్రులపై కేసు



మండవల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామచంద్రరావు

కైకలూరు: లైసెన్స్ లేకుండా తల్లిదండ్రులు బిడ్డలకు వాహనాలు సమకూర్చితే బండి నడిపిన వారితో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని కైకలూరు సర్కిల్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని కైకలూరు రూరల్, మండవల్లి, కలిదిండి, ముదినేపల్లి మండలాల్లో వాహన తనిఖీలు ఆయా ఎస్ఐలు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్నపిల్లలు వాహనాలతో యాక్సిడెంట్ చేస్తే పిల్లలపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని బాలురు, బాలికలు వాహనాలు నడిపితే నేరమన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా స్టేషన్ల ఎస్ఐలు రాంబాబు, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి



పమిడిముక్కల: భూసార పరీక్షలు చేయించుకుని అవసరమైన మేరకు ఎరువులు వాడి, నేల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని ఏఓ గణేష్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని అమీనపురం, వీరంకి, మేడూరు గ్రామాల్లో భూసార పరీక్షల కోసం పొలాల నుంచి మట్టి నమునాల సేకరణను ఏఓ పర్యవేక్షించారు. మట్టి నమూనాలు తీసే విధానాన్ని రైతులకు వివరించారు. రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి మట్టి నమూనాలను తీయించుకుని ఫలితాలను పొందాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రవితేజ పాల్గొన్నారు.

మద్యం అనర్థాలపై అవగాహన

మచిలీపట్నంఅర్బన్: మద్యం అతిగా సేవించడం వల్ల వచ్చే అనర్థాలు, నష్టాలపై కమిటీ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్) ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ కాలనీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీ గంగాధరరావు మాట్లాడుతూ అతిగా మద్యం తాగడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. మద్యం అలవాటు ఉన్నవారి కోసం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డీ ఎడిక్షన్ సెంటరును ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యానికి బానిసైన యెడల ప్రభుత్వ ఆస్పత్రిలో జాయిన్ చేస్తే పూర్తి ఆరోగ్యవంతులుగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రములో డీవైఈఓ శేఖర్ సింగ్, ఏఈఎస్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శనివారం భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ముత్తేవి మాధవ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం భక్తులు హనుమాన్ చాలీసాను 108 సార్లు పఠించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



జమిదింటకుర్రు(పెదపారుపూడి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తుందని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. మండలంలోని జమిదింటకుర్రులో కొద్ది రోజుల క్రితం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు గుడిపాక వెంకటసుబ్బమ్మకు తహసీల్దార్ శనివారం రూ.10 వేలు అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన టీడీపీ నేత నూతక్కి విశ్వేశ్వరరావు బాధితురాలికి నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో దానియేలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక 28వ వార్డులో 'మీకోసం మీ వెనిగండ్ల' కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌తో కలిసి వార్డుల్లో పర్యటించారు. ఇందిరానగర్ కాలనీ, న్యూ కాలనీ, వాంబే కాలనీ, విజయవాడ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రోడ్ల సమస్యలు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం తాగునీటి సరఫరా, డ్రెయినేజ్ పారుదల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుడివాడ టౌన్: గుడివాడ రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయం (ఆర్డీఓ ఆఫీస్) నందు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రజావేదికలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

శాంతి ర్యాలీ



గుడివాడ టౌన్: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక కార్మికనగర్‌లోని మజీద్–ఎ–మొహమ్మదీయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఐక్యతకు నిదర్శనమైన భారతదేశంలో ఈ విధమైన దాడులు జరగడం దుర్మార్గమన్నారు. ఉగ్రదాడిలో అమరులైన వారికి సంతాపం ప్రకటించారు. ఉగ్రవాద చర్యలను ముస్లిం ఐక్యవేదిక అన్నివేళలా ఖండిస్తుందన్నారు. తీవ్రవాద చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో హాజీ సయ్యద్ మహబూబ్ అలి, మసీదు అధ్యక్షుడు షేక్ మీరాభాషా, సభ్యులు పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వరస్వామి మాస కల్యాణం



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. ఈ కల్యాణాన్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మంగినపూడి బీచ్‌లో హెచ్చరిక బోర్డులు

కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో మెరైన్ పోలీసులు శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్ఐ వీజే చంద్రబోస్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా మంగినపూడి బీచ్‌లో సుడిగుండాలు, నాలి ఏర్పడిన నేపథ్యంలో స్నానాలకు వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సిబ్బంది విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

అధిక దిగుబడులకు లింగాకర్షణ బుట్టలు

వంగ తోటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



వేములమడలో వంగతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వేములమడ(కూచిపూడి): అధిక దిగుబడుల కోసం కూరగాయల తోటల్లో లింగాకర్షణ బుట్టలు ఎకరానికి నాలుగు నుంచి ఎనిమిది వరకు పెట్టుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మొవ్వ మండలం వేములమడ గ్రామంలో శనివారం వంగ తోటను మచిలీపట్నం జిల్లా వనరుల శాఖ, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. పైరులో కాండం తొలిచే పురుగు, రసం పీల్చే పురుగు ఉద్ధృతంగా ఉన్నాయని, వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వంగ పైరు తలలు నరికి తెగులు పురుగు అధికంగా ఉన్న కొమ్మలు, కాయలను ఏరివేసి తగల బెట్టాలని తెలిపారు. నరికిన కొమ్మలపై బైటాక్స్ మూడు గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసి నీటి తడులు పెట్టి ఎరువులు వేసుకోవాలన్నారు. అనంతరం వేప మందు(1500 పీఎం) మూడు మిల్లీ గ్రాములు, ఇమిడోక్లోప్రిడ్ 0.4 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి గాని స్పైనోసాడ్ 0.3 మిల్లీలీటర్లు మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణి, ఏఓలు శ్రీనివాస్, పద్మజ, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి మంజువాణి, పామర్రు ఉద్యాన అధికారి జె.కీర్తి దేవ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



కమిషనర్‌ను సత్కరిస్తున్న యాదవ సేవాసంఘం సభ్యులు

గుడివాడ టౌన్: గుడివాడ మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌ను శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. కమిషనర్ చాంబర్‌లో సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా ఆయన్ను కలిసి అభినందలు తెలిపారు. పట్టణాభివృద్ధిలో తమ సహకారం పూర్తిగా ఉంటుందని సంఘం సభ్యులు అన్నారు. కార్యక్రమంలో సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, నాయకులు వీర్ల వెంకటేశ్వరరావు, కె. హరిబాబు, జాజుల తాతారావు, ఎస్. వెంకటరామారావు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మస్తాన్

మొవ్వ: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే మస్తాన్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మట్టి తవ్వకాలపై వీఆర్వోలు దృష్టి పెట్టి సకాలంలో సమాచారం అందించాలన్నారు. అనుమతులు తీసుకుని మట్టి తవ్వకాలు ప్రారంభించినా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే తరలించాలన్నారు. రాత్రి వేళల్లో నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ ఏ విజయదుర్గ, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

పామర్రు: స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి శనివారం తెలిపారు. తరగతుల్లో విద్యార్థులకు ఉచితంగా పలు రకాల ఆటలు, చదువు తదితర విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలపారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని ఆగినపర్రు, మేడూరు, పెనుమత్స, పమిడిముక్కల, కపిలేశ్వరపురం, గురజాడ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు తెలిపారు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండవల్లిలో..

మండవల్లి: ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు మండవల్లి గ్రంథాలయాధికారి షేక్ పర్వీన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, బుక్ రీడింగ్ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): క్రీడలు శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి, సామాజిక అనుబంధాలకు ఎంతగానో తోడ్పడతాయని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఉద్యోగుల పిల్లలు పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉంటే వారిని సంఘం తరఫున అభినందించాలని సూచించారు. ఉద్యోగులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించేందుకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఉద్యోగులందరికీ ఆరోగ్య పథకం గుర్తింపు కార్డులు వచ్చేలా సంఘ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్రికెట్‌లో విజేతలైన గుడ్లవల్లేరు, నాగాయలంక మండలాల బృందాలకు ట్రోఫీలు అందజేశారు. వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీపీఓ జే అరుణ, బొమ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



అల్లూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ముదినేపల్లి రూరల్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా మండలంలోని అల్లూరు, ఈడేపల్లి, బొమ్మినంపాడు గ్రామాల్లో ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అల్లూరు దళితవాడ రామాలయం నుంచి మెయిన్ సెంటర్ కృష్ణమందిరం డేవిడ్‌రాజు ప్రార్థనామందిరం మీదుగా నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా పహెల్గాం దాడిలో మృతి చెందిన వారికి ఘనంగా నివాళులర్పించారు.